
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
5★★ జిల్లా వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025



గోదావరి ఎత్తిపోతలకు జంక్షన్

శ్రీపాద ఎల్లంపల్లి

- మేం కట్టిన ప్రాజెక్టు నిలిచింది.. వాళ్లు కట్టిన మేడిగడ్డ కుంగింది
- హరీష్‌రావు, కేటీఆర్ మాటలు పట్టుకుంటే గ్రామాలు కొట్టుకుపోతాయి
- శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

7



శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి



ముటపెల్లి-కొత్తపేట గ్రామాల మధ్య తెగిన రోడ్డు

- పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- రహదారులు, కల్వర్టులపై నుంచి వరద నీరు
- మూడు రహదారులు, కల్వర్టు ధ్వంసం

జోరువాన..

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురువారం జోరువాన కురిసింది. కథలాపూర్‌లో 84.8 మిల్లీ మీటర్లు, మల్లాపూర్‌లో 67.5 మిల్లీమీటర్లు, కొడిమ్యాల మండలం పూడూరులో 59.8 మిల్లీ మీటర్లు, భీమారం మండలం గోవిందారంలో 53.3, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో 48.5 , పెగడపల్లిలో 48, రాయికల్‌లో 43.8, కోరుట్లలో 41.3 , మల్యాలలో 36, మెట్‌పల్లిలో 34.5, కొడిమ్యాల మండలం తిమ్మాపూర్‌లో 32.8, ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 27, మల్లాపూర్ మండలం రాఘవపేటలో 23.5, ఎండపల్లిలో 20.8, సారంగాపూర్‌లో 10.5, జగిత్యాలలో 8.5, గొల్లపల్లిలో 6.8, మేడిపల్లిలో 6.3, ఎండపల్లి మండలం గుల్లకోటలో 5.8, ధర్మపురి మండలం జైనా, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 3మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

● పలు గ్రామాల్లో కూలిన ఇళ్లు

జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం వల్ల జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాల్లో రహదారులు, మురికి కాలువలు జలమయమయ్యాయి. జిల్లాలోని 42 ప్రాంతాల్లో కల్వర్టులపై నుంచి వరద నీరు ప్రవహించింది. 11 మండలాల్లోని 37 గ్రామాలు భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభావితం అయినట్లుగా అధికారులు గుర్తించారు. జిల్లాలోని సారంగపూర్ మండలం బతుకమ్మ కుంటకు గండి పడగా అధికారులు తాత్కలిక మరమ్మత్తులు చేపట్టారు. జిల్లాలో 13ఇళ్ల పాక్షికంగా కూలిపోయాయి. మూడు రహదారులు, ఒక కల్వర్టు దెబ్బతిన్నట్లుగా అధికారులు గుర్తించారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం వద్ద వాగు నీరు పొంగిపొర్లి బ్రిడ్జి మునగడంతో ధర్మపురి- జగిత్యాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధర్మపురి మండలం ఆకుసాయిపల్లె వద్ద లో లెవల్ వంతెన నీట మునగడంతో రాకపోకలు నిలిచాయి. ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్, యామాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా వేసిన రహదారి నీటిప్రవహానికి కొట్టుక పోవడంతో రాకపోకలు నిలిచాయి. కథలాపూర్ మండలం ఇప్పపల్లి- తాండ్రియాల గ్రామాల మధ్య కాలువ ఉధృత స్థాయిలో ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లో గల ఇళ్లలోకి, సారంగపూర్ మండలం రేచపల్లి ఎస్‌సీ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. సారంగపూర్ మండలం పోచంపేట-లచ్చక్కపేట గ్రామాలమధ్య రహదారి తెగిపోయి రాకపోకలు అంతరాయం కలిగింది. సారంగపూర్ మండలం గణేష్‌పల్లిలో ఓ ఇల్లు కూలిపోయింది. బీర్‌పూర్ మండలం కమ్మునూరు వద్ద గోదావరి నీరు పంట పొలాలను ముంచేసింది.

● ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

వెల్గటూరు మండలం కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్ వద్ద రోడ్డుపై నుంచి వరద నీరు భారీగా ప్రవహించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. కథలాపూర్ మండలం భూషణ్ రావుపేట వద్ద రాళ్లవాగు కుడి కాలువకు గండి పడింది. గొల్లపల్లి మండలంలో పిడుగుపడి ఓ ఇంటి గోడలు బీటలు వారాయి. విద్యుత్ వైర్లు కాలిపోయాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు కలెక్టర్ సత్యప్రసాద్ సెలవు ప్రకటించారు. జిల్లాలోని ధర్మపురి, వెల్గటూరు మండలం కోటిలింగాల దేవస్థానాల వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలో వర్షాలు, వరద పరిస్థితిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రత్యక్షంగా పలు ప్రాంతాల్లో పరిశీలించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌లు ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి సమీక్షించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు.



ధర్మపురి మండలం ఆకుసాయిపల్లె వద్ద లోలెవల్ వంతెన నీట మునగడంతో నిలిచిన రాకపోకలు



జగిత్యాల రూరల్ మండలం అనంతారం వద్ద నీట మునిగిన బ్రిడ్జి



వెల్గటూరు మండలం కోటిలింగాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ధర్మపురి వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నది, ఆకుసాయిపల్లె లోలెవల్ వంతెన, పలు ప్రాంతాలను కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఎలాంటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు సత్వరమే అధికారులు స్పందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మదుసూదన్, ఇరిగేషన్ శాఖ ఇన్‌ఛార్జ్ ఈఈ చక్రునాయక్, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో రవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్

రాయికల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామోజీపేట-భూపతిపూర్ మెయిన్ రోడ్డు, రాయికల్-ఇటిక్యాల, రాయికల్-మైతాపూర్ బ్రిడ్జిల వద్ద పెరిగిన వరద ఉధృతిని గురువారం కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

●మల్లాపూర్: మండలంలోని వాల్గొండ శివారులోని గోదావరి నదిని కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు పరిశీలించారు. వారి వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరిం చుకుని బుధవారం వాడవాడలో వివిధ రూపాలలో గణనాథుడు కొలువు దీరాడు, పట్టణంలోని యువజన సంఘాలు ఒకరిని మించి ఒకరు విభిన్న రూపాలలో ఏర్పాటు చేసిన వినాయకుని రూపాలు చూపారులను ఆకట్టుకుంటున్నాయి.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయ చవితి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా .రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖమంత్రి అడ్లూరిలక్ష్మణ్ కుమార్- కాంతాకుమారి దంపతులు క్యాంపు కార్యాలయంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి పాడి పంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ ఆ వినాయక దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మాజీఎంపీటీసీ సీపతి సత్యనారాయణ, సింహరాజు ప్రసాద్, ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతులు

వర్షాల నేపథ్యంలో క్రీడా కార్యక్రమాలు రద్దు

● డీవైఎస్‌వో రవి కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నిర్వహించాల్సిన క్రీడాకార్యక్రమాలను రద్దుచేసినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ తెలిపారు. ఈ నెల 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేవలం జన్మదిన వేడుకలు మాత్రమే నిర్వహించబడునని తెలిపారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్ (బాలికలు, బాలురు) మరియు బాట్మింటన్ క్రీడలను నిర్వహించవలసి ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో క్రీడలు రద్దు చేశామని తెలిపారు. తదుపరి తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వివరాలకు 9059465889కు సంప్రదించాలని కోరారు.

గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించాలి

● జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్ సూచించారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో జాబితా ప్రదర్శించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏరాటు చేసి ఓటర్ల జాబితాలో సవరణలు, సలహాలు తీసుకొని జాబితాను చేయాలన్నారు. అనంతరం ఎలక్షన్ వార్డుల వారీగా అన్ని గ్రామాల జిపిఈఆర్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఓటర్ జాబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సలీంతో ప్రదర్శింపజేశారు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల అగ్రికల్చర్/రాయికల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీఎండీ పర్యటించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన బోర్నపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లో పర్యటించి, విద్యుత్ పునరుద్ధరణకు ఆదేశించారు. ఈ భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ప్రతి ఉద్యోగి హెడ్ క్వాటర్‌లోనే ఉండాలని, ఎవరికీ ఎలాంటి సెలవులు ఉండవన్నారు. ఎటువంటి విద్యుత్ అంతరాయం కలిగిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా విద్యుత్ ప్రగతిభవన్‌లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ అంతరాయాలను, సమస్యలను జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఇ సుదర్శనంను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో భారీవర్షాల కారణంగా ఎలాంటి విద్యుత్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

మెట్‌పల్లి పట్టణంలో

●మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా హితవు పలికారు. ప్రతీ సెక్షన్‌లో స్తంభాలు, సామాగ్రి నిలువ ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెటుపల్లి డీఈ మధుసూదన్, ఏడీఈ మనోహర్, ఏఈలు అమరేందర్, రవి, ప్రదీప్, శివకుమార్, శ్రీనివాస్, అజయ్, జేఏఓలు పాల్గొన్నారు.

యూరియా విషయంలో ఆందోళన వద్దు

● జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

జగిత్యాల అగ్రికల్చర్, ఆగష్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం 2025 పంటల సాగుకు అవసరమైన యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,76,146 బస్తాల యూరియా రైతులందరికీ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఇంకా 7,555 బస్తాల యూరియా నిల్వ ఉన్నదన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిన్నారు. శుక్రవారం వరకు మరో 35,555 బస్తాలు జిల్లాకు రానున్నట్లు పేర్కొన్నారు. అధిక వర్షాలు ఉన్నందున రైతులు వర్షాలు తగ్గే వరకు ఎటువంటి ఎరువులు వాడకూడదని డీఏవో రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఆయన సూచించారు.

పండగ పూట.. భార్య వద్దకు వెళుతూ..

● బైక్‌తో సహా వ్యవసాయ బావిలో పడిన యువకుడు


అంజనేయులు(ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పండగపూట దూరంలో ఉన్న భార్యను కలుద్దామని ఉత్సాహంగా బయలుదేరిన ఓ యువకుడు బైక్‌తోసహా బావిలో పడిపోయాడు. మరుసటి రోజు అటుగా వెళ్లిన ఓ రైతు బావిలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు.. వివరాలిలా ఉన్నాయి..

మానకొండూర్ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గాలిపల్లి అంజనేయులు(40) ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తోంది. ఆమెను కలిసేందుకు బుధవారం తెల్లవారు జామున 4.30గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. బైక్‌ను కరీంనగర్ బస్టాండ్‌లో పెట్టి అక్కడి నుంచి బస్సులో వెళతానని కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు కర్నూల్ అంజనేయులు కర్నూల్ వెళ్లాడని అనుకున్నారు. గురువారం ఉదయం లింగాపూర్-మానకొండూర్ రోడ్డులోని శ్రీనివాస్‌నగర్ శివారులో ఓ వ్యవసాయ బావిలో అంజనేయుల మృతదేహం కనిపించింది. అటుగా వెళ్లిన ఓ రైతు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వారుఅంజనేయులు కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. బుధవారం తెల్లవారుజామున అంజనే యులు బైక్‌పై బయల్దేరాడని వారు పోలీసులకు చెప్పారు. దీంతో రెస్క్యూ టీం సహాయంతో పోలీసులు అంజనేయులు మృతదేహాన్ని బయటకు తీయగా అదే బావిలో అతని బైక్ కనిపించింది. దానిని బయటకు తీయిం చిన పోలీసులు అంజనేయులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అంజనేయులుకు ఇద్దరు కుమారులు.

పెళ్లి కావడం లేదని యువకుడి బలవన్మరణం


పవన్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతి రెడ్డిపేట గ్రామానికి చెందిన వేల్పుకొండ పవన్(29) ఈనెల27న ఆత్మహ త్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పుకొండ పవన్ వృత్తిరిత్యా మంగలి పనిచేస్తున్నాడు. రెండు సంవత్సరాల నుంచి పెళ్లి సంబంధాలు వెతుకుతున్నా సంబంధం కుదురడం లేదు. తనకంటే చిన్నవాళ్లకు వివాహాలు జరుగుతుండటంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామపెద్దల ఎదుట పవన్ బాధపడు తుండేవాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 27న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పవన్ అక్కడ మృతి చెందాడు. మృతుడు పవన్ సోదరుడు వేల్పుకొండ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


మానకొండూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన శ్యామల (24) అనే వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. శ్యామల మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురవారం మృతి చెందింది.

రాజన్న సేవలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

వేములవాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని ఎస్సీఎస్టీమైనారిటీ సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో రాధాబాయ్ స్వాగతం పలికారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్న అనంతరం మంత్రి అడ్లూరిలక్ష్మణ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండలపంలో వేద పండితులు ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందించగా ఆలయఈవో రాధాబాయిస్వామి వారి శేషవస్త్రంతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. ఏఈవో శ్రవణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ పరిశీలకులు నూగూరి నరేందర్, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

పదోన్నతుల కోసం ఎదురుచూపులు



● పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల్లో అర్హత కల్పించాలంటున్న బీఈడీ టీచర్లు
● ప్రస్తుత ప్రమోషన్ల ప్రక్రియలో చోటు కోసం డిమాండ్
● ఇప్పటికే ముఖ్యమంత్రికి లేఖ

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టుల పదోన్నతుల కోసం బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. సీనియార్టీ, అర్హతలు ఉండి బీఈడీ పూర్తి చేసిన ఎస్జీటీలను ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న పీఎస్‌హెచ్‌ఎం (ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు) ప్రమోషన్ల ప్రక్రియలో పక్కన పెట్టడంపై ఆందోళనకు గురవుతున్నారు. జీఓ ఎంఎస్ నంబరు 11, 12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలను సైతం ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలువురు బీఈడీ అర్హత గల ఎస్జీటీలు లేఖ రాశారు.

ఉమ్మడి రాష్ట్రంలో నియామకమై...

ఉమ్మడి రాష్ట్రంలో 2008 సంవత్సరం డీఎస్సీ వరకు ఇంటర్, డీఈడీ పూర్తి చేసిన వారితో పాటు డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన వారు ఎస్జీటీలుగా నియామకం పొందారు. తర్వాత కాలంలో డీఈడీ చేసిన వారు మాత్రమే ఎస్జీటీ పోస్టులకు అర్హులు అని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. తర్వాత కాలంలో డీఈడీ చేసిన వారు మాత్రమే ఎస్జీటీ పోస్టులకు అర్హులయ్యారు. దీంతో బీఈడీ అర్హతతో ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతికి అర్హత లేదని తిరస్కరణకు గురవుతున్నారు.


స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ కొమురయ్య, ఉపాధ్యాయులు (ఫైల్)

రాష్ట్రంలో 25 వేల మందికి పైగా..

రాష్ట్రంలో సుమారు 25 వేల మంది వరకు బాధిత ఉపాధ్యాయులున్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. 2008 సంవత్సరం, అంతకు ముందు ప్రాథమిక పాఠశాలల్లో బీఈడీ అర్హతతో పలువురు ఎస్జీటీలుగా నియామకయ్యారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు కంటే ముందే నియామకమైన తమకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హత లేదని అనడం సరికాదని సంబంధిత ఉపాధ్యాయులు వాదిస్తున్నారు.

జీవో నంబరు 11,12 ఉత్తర్వుల సవరణకు డిమాండ్

జీవో నంబరు 11, 12లో 18వ పోస్టులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కేవలం డీఈడీ పూర్తి చేసిన టీచర్లు అర్హులని పేర్కొనడంతో తమకు అన్యాయం జరుగుతోందని వారు వాపోతున్నారు. తక్షణమే జీవో నంబరు 11, 12లను సవరించి పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు డీఈడీ టీచర్లతో పాటు బీఈడీ చేసిన ఎస్జీటీలను కూడా అర్హులుగా పరిగణించాలని వేడుకుంటున్నారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌లను కలిసి బాధిత టీచర్లు వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే బీఈడీ చేసిన ఎస్జీటీలను పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు అర్హులుగా పరిగణిస్తున్నారని, తెలంగాణలోనూ అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపించాలి

హనుమంతరావు, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో బీఈడీ అర్హత గల ఎస్జీటీలను ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యా యులుగా పదోన్నతి కల్పించడానికి ప్రభుత్వం చొరవ చూపించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇస్తున్న మాదిరిగానే తెలంగాణలో సైతం అర్హులైన అవకాశం కల్పించాలి.

పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలి

బోయినిపల్లి ప్రసాద్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జగిత్యాల



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యా యుడిగా డీఈడీ టీచర్లతో పాటు బీఈడీ టీచర్లకు అవకాశం కల్పించాలి. పాతికేళ్లుగా ఎస్జీటీలుగా విధులు నిర్వహిస్తున్న బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులను పీఎస్ హెచ్‌ఎం ప్రమోషన్లలో తిరస్కరించడం సమంజసం కాదు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి..

చికిత్స పొందుతూ మృతి


మహేష్(ఫైల్)

సారంగాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామంలో కొద్దిరోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన తోట మహేష్ (37) అనేవ్యక్తి మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. తోట మహేష్ టైల్స్‌పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల23న మద్యం మత్తులో గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు ఈ విషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు.

దీంతో రెండు రోజు తర్వాత అతడి ఆరోగ్యం దెబ్బతిన డంతో గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మహేష్ ఆన్‌లైన్ క్రిప్టోకరెన్సీలో సుమారు కోటి రూపాయల వరకు పెట్టుబడి పెట్టడంతో పాటు తన స్నేహితులను, బంధువుల తోనూ పెట్టుబడి పెట్టించి వారికి నమ్మకంగా బాండ్‌పేపర్లు రాసిచ్చినట్టు గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో బాండ్‌పేపర్లు రాసిచ్చిన వారు ఒత్తిడి చేయడంతో మనస్థాపానికి గురై క్రిమి సంహారక మందు తాగినట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. తన భర్త మద్యం మత్తులో క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్య చేసు కున్నట్లు మహేష్ భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గీత పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


మృతిచెందిన గంగాధర్

మల్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం మూడుసార్లు విదేశాలకు వెళ్లి సరైన పనిలేక తిరిగి రావడం, గొర్రెల వ్యాపారం చేసినా కలిసి రాకపోవడంతో అప్పుల పాలై మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సారంగ పూర్ మండ లం లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎలకుచ్ గంగాధర్ (37)కు మల్యాల మండలం మద్దుట్లకు చెందిన వనజతో వివాహం అయింది. కొన్నాళ్ల క్రితం గంగాధర్ ఉపాధి కోసం పలుమార్లు విదే శాలు వెళ్లివచ్చాడు. అనంతరం ఇక్కడ గొర్రెల వ్యాపారం చేసినా నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడు తుండేవాడు. దీంతో భార్య వనజ తన తల్లిగారిల్లు మద్దుట్లకు వచ్చి ఉంటోంది. బుధవారం మదుట్లకు వచ్చిన గంగాధర్ మద్యంమత్తులో భార్యతో గొడవపడ్డాడు. దీంతో భార్య తన పిల్లలతో సోదరుడి ఇంటిలో పడుకోగా అదేరోజు రాత్రి గంగాధర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి చిన్న గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పండగ పూట విషాదం

● ఎస్సారెస్పీ కాలువలో ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి గల్లంతు


శ్రీకర్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం రామారావుపల్లి గ్రామశివారులో బుధవారం వినాయకచవితి రోజు ఎస్సారెస్పీ కాలువలో ట్రాక్టర్ బోల్తా పడి కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి(30) అనే యువకుడు గల్లంతయ్యాడు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కాటిపల్లి రాధ, శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమారుడైన శ్రీకర్‌రెడ్డి రామారావుపల్లి గ్రామ శివారులోని పౌల్ట్రీఫాంలో గణపతి పూజలో పాల్గొన్నాడు. అనంతరం పెద్దాపూర్ గ్రామంలో వినాయక విగ్రహం ప్రతిష్ఠించడానికి బల్లను పౌల్ట్రీఫాం నుంచి ట్రాక్టర్‌లో తీసుకొని ఇద్దరు స్నేహితులు మిట్టపల్లి రాజేందర్‌రెడ్డి, ఇల్లెందుల రమణతో కలిసి శ్రీకర్‌రెడ్డి బయలుదేరాడు. మిట్టపల్లి రాజేందర్‌రెడ్డి ట్రాక్టర్ నడుపుతుండగా ఇంజన్‌కు ట్రాలీకి మధ్యలో కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి, ట్రాలీలో ఇల్లెందుల రమణ ఉన్నారు. రామరావుపల్లె బ్రిడ్జి వద్దకు రాగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న మిట్టపల్లి రాజేందర్ రెడ్డి, ఇల్లెందుల రమణ కాలువ ఒడ్డునపడగా కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి నీట మునిగి గల్లంతయ్యాడు. వెంటనే స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలిపి కాలువలో శ్రీకర్‌రెడ్డి కోసం గాలింపు చర్యలు చేశారు. కోరుట్ల ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి బోల్తా పడ్డ ట్రాక్టర్‌ను బయటకు తీసి శ్రీకర్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

మృతుడి తల్లిదండ్రులైన కాటిపల్లి రాధ, శ్రీనివాస్‌రెడ్డిలను గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు తదితరులు పరామర్శించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆచూకీ కోసం ఆలస్యం అవుతుందని బంధువులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంబంధిత ఎస్సారెస్పీ కాలువ అధికారులకు నీటి ప్రవాహాన్ని తగ్గించాలని మంత్రి సూచించారు.

స్వర్ణ పతక విజేతకు ఘన స్వాగతం


చికితను సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ప్రపంచ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్ అండర్21 మహిళల విభాగంలో స్వర్ణపతకం సాధించింది. గురువారం ఆమె స్వదేశానికి తిరిగి రాగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద రాష్ట్ర క్రీడాశాఖమంత్రి వాకిటిశ్రీహరి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనరెడ్డి, కుటుంబ సభ్యులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కెనడాలో జరిగిన ప్రపంచ స్థాయి ఆర్చరీ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని బంగారం పతకం సాధించి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపచేశారని కొనియాడారు.

పోగొట్టుకున్న బ్యాగ్ బాధితురాలికి అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కూరగాయల మార్కెట్‌లోని వెంకటేశ్వర టెంపుల్ వద్ద పోగొట్టుకున్న ఓ బ్యాగ్‌ను కరీంనగర్ పోలీసులు తిరిగి బాధితురాలికి అప్పగించారు. గురువారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఓబ్యాగ్ కరీంనగర్ మార్కెట్ వెంకటేశ్వర టెంపుల్ వద్ద దొరికింది. బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ రాజన్న, అందులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బాధితురాలి ఫోన్ నెంబర్‌ను గుర్తించారు. వెంటనే బాధితురాలికి ఫోన్ చేసి పోలీసు ఠాణా పిలిపించారు. ఠాణాకువచ్చిన బ్యాగ్ యజమాని బ్యాగ్‌తోపాటు అందులో ఉన్న నగదు 1,980రూపాయలు, ఒక రోల్డ్‌గోల్డ్ చైన్‌తోపాటు అన్ని వస్తువులను క్షేమంగా అందజేశారు. పోలీసుల సత్వర స్పందన, నిజాయతీకి బాధితురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వీణవంక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామ చివరులో వాటర్‌ట్యాంక్ వద్ద పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు దాడిచేసి ఐదుగురుని పట్టుకున్నారు. పక్కాసమాచారంతో దాడులు చేయగా పదిమంది ఆడుతుండగా ఐదుగురుని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.10,020, నాలుగుమోటారుసైకిళ్లు, ఐదుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బంగారు తాడు దొంగతనం

వీణవంక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పాకాల కనుకమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మెడలో నుంచి బంగారు తాడు దొంగలించుకొని పోయారు. ఈమేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంగారు తాడు 2తులాలు ఉంటుందని దానివిలువ దాదాపు యాభై విలువ ఉంటుందని తెలిపారు. కనుకమ్మ కుటుంబసభ్యులు పాకాల భూపతిరెడ్డి ఫిర్యాదుమేరకుకేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

చందుర్తి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లిలో ఓ యువతి గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నేరెళ్ల తిరుపతి-వనిత దంపతుల కుమార్తె పూజిత(21) సంవత్సరం క్రితం మండలంలోని నర్సింగాపూర్ గ్రామం చెందిన ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. నెలరోజుల క్రితం భర్తతో విడాకులు తీసుకొని ఇంటి వద్దనే ఉంటోంది. మనస్థాపానికి గురైన పూజిత ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడినట్లు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాశిగుట్టతండాలోని రైతు గుగులోతు సక్కుకు చెందిన పాడిగేదె బుధవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. తండాలోని హైమాస్ట్ లైటు వద్ద నుంచి వెళుతున్న పాడి గేదె కరెంటు షాక్‌కు గురైంది. సుమారు రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు సక్కు పేర్కొన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

బాలిక మృతి కేసులో పోలీసుల అదుపులో నిందితులు?

● మనోవేదనతో ఉరివేసుకొని బాలిక తండ్రి ఆత్మహత్య

ఇల్లంతకుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపులతో బాలిక (17) మృతి చెందిన కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ముగ్గురు యువకులు లైంగిక వేధింపులకు గురిచేసి వీడియోలు తీసి బెదిరించడంతో బాలిక అస్వస్థతకు గురై మంగళవారం మృతిచెందింది. బాలిక మృతికేసులో వినోద్, సతీష్, జామలపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ విషయమై నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. బాలిక తండ్రిని బుధవారం ఆయన అక్క కామారెడ్డి జిల్లాలోని ఆమె ఇంటికి తీసుకవెళ్లింది. కుమార్తె మృతిని తట్టుకోలేక ఆయన గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట పరిధిలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో చేపల వేటకు వెళ్లిన రహమాన్(20) అనే యువకుడు గల్లంతైనట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గిరిదర్‌పూర్ ప్రాంతానికి చెందిన రహమాన్ కొంతకాలంగా కరీంనగర్‌లోని కశ్మీరగడ్డలో నివాసం ఉంటున్నాడు. రహమాన్ గురువారం చింతకుంటలోని ఎస్‌ఆర్‌ఎం కళాశాల వెనుక వైపున కెనాల్‌లో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడని సీఐ తెలిపారు. రహమాన్ కోసం గాలింపు తున్నట్లు తెలిపారు.

దేశభాషలందు తెలుగు లెస్స



నేడు తెలుగు భాషా దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముత్యాల్లాంటి అక్షరాల లేఖన సాంప్రదాయమున్న విశిష్ట భాష తెలుగు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని విదేశీయులు ప్రశంసించిన తెలుగు ప్రస్తావన మహాభారతంలో ఉంది. సాహిత్యానికి ఆయువు పట్టుగా తెలుగు ప్రముఖ స్థానాన్ని పొందింది. మన భాషలో మాధుర్యాన్ని పరదేశీయులు కూడా అభిమానించారు. భాషలో వ్యవహారిక వాదానికి నాంది పలికిన భాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటారు.

తెలుగు భాష పుట్టు పూర్వోత్తరం..

పోర్చుగీసు వారు మన భాషను జంతు అని, తెలుగు వారిని జంతియే అన్నారు. ఐతరేయ బ్రాహ్మణంలో, వ్యాస, నన్నయ భారతాల్లో, మనుస్మృతి, వాయు పురాణం, భాగవతంలో ఆంధ్ర ప్రస్తావన కన్పిస్తుంది. అంధ తాలూకు ప్రాకృత రూపమే అంధకం కాగా దాని సంస్కృత రూపమే అంధ్ర అని బరో అనే భాషా శాస్త్రవేత్త అన్నారు. తెనుంగు, తెలుగు అనే పదాలను నన్నెచోడుడు, పాల్కురికి సోమనలు చెప్పగా త్రిలింగం అనే పదం స్కాంద, బ్రహ్మాండ పురాణాల్లో ఉంది.

తెలుగు మాగాణంలో గిడుగు అడుగులు..

రామమూర్తి ఆధునిక విద్యలో విశాల దృష్టిని కనబరిచి గ్రాంథిక భాషకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపి తెలుగు భాషకు జీవం పోశారు. పార్వతేయులైన సవరల జీవితంలో వెలుగు నింపడం, ముఖ లింగ క్షేత్ర ప్రాశ స్త్యాన్ని ఆవిష్కరించడం ఆయన జీవన ప్రస్థానంలో కీలక మలుపులు. తెలుగు -సవర, ఇంగ్లీష్-సవర నిఘంటువులు, గద్య చింతామణి, వ్యాసావళి, నిజ సాంప్రదాయం వంటి గ్రంథాల రచనతో పాటు తొలి వ్యవహారిక తెలుగు భాషా పత్రికను స్థాపించారు. భాషా సౌందర్యాన్ని ప్రజలకు అందించేందుకు సభలు నిర్వహించారు. కందుకూరి, గురజాడ వంటి సాహితీవేత్తలతో కలిసి వర్తమాన ఆంధ్ర భాషా ప్రవర్తక సమాజాన్ని ప్రారంభించారు. విజ్ఞానం వికసించాలంటే భాషా సంస్కరణే సమచిత సాధనమన్న ఆయన కవితా లోకానికి, భాషావాదులకు మార్గదర్శకులు.

అధికార భాషగా తెలుగు అమలు..

డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని



మన భావాల్ని హాయిగా, ఆనందంగా పంచుకోవడానికి మాతృభాష ఓ మంచి సాధనం. తల్లి చేతి గోరుముద్దలు, పాడే జోల పాటల వంటిది మాతృభాష. ప్రభుత్వం తెలుగును అధికార, నిర్బంధ భాషగా అమలు చేయాలి.

ప్రేరణగా నిలిచేది తెలుగు భాష..

డాక్టర్ నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత



జీవిత కాలమంతా ప్రేరణగా నిలిచేది తెలుగు భాష. ఆలోచన్ని సహజ పద్ధతిలో, సులభ రీతిలో శాస్త్రీయంగా చెబుతుంది. తెలుగు ప్రపంచ భాషల్లో దేనికీ తీసిపోనిది. అందరూ తెలుగులో మాట్లాడాలి. రాయాలి. చదవాలి.

నేటి తరానికి తెలియజేయాలి

అన్నవరం దేవేందర్, రచయిత



సభలు, సమావేశాలు, అష్టావధానాలు, గ్రంథా విష్కరణల ద్వారా భాషా మాధుర్యాన్ని నేటి తరానికి తెలియజేయాలి. మాండలిక, ప్రాంతీయ భాషలను బతికించుకోవాలి. సాహితీవేత్తలు, పరిశోధకులతో ఉపన్యాసాలిప్పించాలి

ప్రాథమిక స్థాయి నుంచే నేర్పించాలి

కాండూరి వేంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత



ప్రాథమిక స్థాయి నుంచే తెలుగును నేర్పించాలి. ప్రజల వ్యవహారానికి దూరం కాకుండా భాషా వికాసం కోసం పునరంకితం కావాలి. మాతృభాషకు దూరమైతే బాధ్యతలకు, భావ సంబంధాలకు దూరమవుతాం.

ఎస్‌యూలో పరీక్షలు వాయిదా

గణేశ్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల28న జరుగనున్న బీఎడ్, ఎంఎడ్ (బాచిలర్, మాస్టర్స్‌ఆఫ్‌ఎడ్యుకేషన్) పరీక్షలను భారీవర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్ ఒక గురువారం ప్రకటనలో తెలిపారు. మిగిలిన పరీక్షలు యధావిధిగా జరుగుతాయని, వాయిదా వేసిన పరీక్షల షెడ్యూల్ మళ్లీ తెలియజేస్తామని తెలిపారు.

గుండుపిన్నుపై గణనాథుడు



గుండు పిన్నుపై బ్రహ్మోస్ మిస్సైల్‌తో గణనాథుడు

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ మైక్రోఆర్టిస్టు గుర్రం దయాకర్ తయారు చేసిన గుండు పిన్ను పై బ్రహ్మోస్‌మిస్సైల్ గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటోంది. గణనాథుడు ఆపరేషన్ సిందూర్‌లో ఇండి యాశక్తిని చాటిచెప్పిన బ్రహ్మోస్‌మిస్సైల్‌ను పట్టుకున్నట్లుగా తయారుచేశాడు. ఈ విగ్ర హం తయారీకి 12గంటల సమయం పట్టినట్లు దయాకర్ వెల్లడించాడు.

రాజన్న ఆలయ ఈవోగా రమాదేవి



ఎల్ రమాదేవి

వేములవాడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయఈవోగా ఎల్ రమాదేవిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో వేములవాడ ఆర్డీవోకు ఆలయఈవోగా అదనపుబాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం గురువారం రమాదేవిని రాజన్న ఆలయ ఈవోగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

జైపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన బైసవిజయ్(43) గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని పట్టణంలోని మేదరిబస్తికిచెందిన విజయ్ స్టీల్ సామాన్ల దుకాణం నడిపిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో అప్పులు ఎక్కువ కాగా ఎలాతీర్చాలో తెలియక ఈ నెల23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈనెల27న జైపూర్ మండలంలోని టేకుమట్ల గోదావరి నది ఒడ్డున మృతేహం కనిపించడంతో స్థానిక కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, బాబు, పాప ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరి ఎత్తిపోతలకు జంక్షన్ శ్రీపాద ఎల్లంపల్లి



శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీకి వస్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- మేం కట్టిన ప్రాజెక్టు నిలిచింది.. వాళ్లు కట్టిన మేడిగడ్డ కుంగింది
- హరీష్‌రావు, కేటీఆర్ మాటలు పట్టుకుంటే గ్రామాలు కొట్టుకుపోతాయి
- శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'గోదావరి జలాల ఎత్తిపోతలకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఒక జంక్షన్.. సాంకేతికంగా నిలబడుతుందనే ఎల్లంపల్లి నిర్మించాం.. మేం నిర్మించిన ప్రాజెక్టు నిలిచింది.. వాళ్ల (బీఆర్ఎస్) కట్టిన మేడిగడ్డ కుంగింది. హరీష్‌రావు, కేటీఆర్ మాటలు నమ్మి కాళేశ్వరం బ్యారేజీల్లో నీళ్లు ఆపితే గ్రామాలకు, గ్రామాలు కొట్టుకుపోయి భారీ నష్టం వాటిల్లుతుంది.' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లు ఏరియల్ వ్యూ ద్వారా ఎల్లంపల్లికి వస్తున్న వరదను గోదావరి ప్రవాహాన్ని, సుందిళ్ల బ్యారేజీని, రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల పట్టణాల లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

అనంతరం గోలివాడ పంప్‌హౌస్ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గంలో శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీ వద్దకు చేరారు. అప్పటికే బ్యారేజీ నుంచి 8 లక్షల క్యూసెక్కుల నీటిని 40 గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. వరద ప్రవాహాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదారమ్మకు కొబ్బరి కాయలు కొట్టి పసుపు, కుంకుమ, పూలు, సారె సమర్పించారు. అనంతరం నీటి పారుదల శాఖాధికారులతో ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్ట్, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న వరద నీటి గురించి కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాస్ గుప్తాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వరద నీటిని అంచనా వేస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలకు నీరు వెళ్లకుండా చూడాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు సూచించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారికంగా ఆరంభించకపోయినా సాగుకు, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తుందన్నారు. గోదావరి జలాల ఎత్తిపోతల్లో జంక్షన్‌గా, గుండెకాయలాగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని, మేం ఆనాడు నిర్మించిన ఈ ప్రాజెక్టు నిలబ డింది.. మేడిగడ్డ కుంగింది.. మీరే చూస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకే రకమైన డిజైన్లతో నిర్మించారన్నారు. మేడిగడ్డ కుంగింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు కూడా ప్రమాదం ఉందని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు సూచించారని, వారి సూచనల మేరకు నీటిని నిల్వ చేయడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, నిర్వహణలో లోపాలున్నాయని నిపుణులు గుర్తించారన్నారు. మేము గొప్పగా నిర్మించామని అతి తెలివి తేటలు గల మామ స్వాతిముత్యం, అల్లుడు ఆణిముత్యం చెప్పుకుంటున్నారని, మూడు బ్యారేజీల్లో లోపాలున్నాయన్నారు. ఘోష్ కమిషన్ గురించి విలేకరులు ప్రశ్నించగా, అసెంబ్లీలో చర్చకు పెడతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, సీపీ అంబర్ కిషోర్‌ఝా, డీసీపీ కరుణాకర్, ఇతర పోలీస్ అధికారులు పోలీస్ బందోబస్తును పరిశీలించారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తున్నది. బుధ, గురువారాల్లో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టుకు 8లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు రావడంతో గోదావరిలోకి 8.20 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. సాయంత్రం వరకు వరద కాస్త తగ్గుముఖం పట్టింది. రాత్రి 7గంటలకు 5,77,398 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, గోదావరిలోకి 38 గేట్లద్వారా 5,77,398క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలిస్తూ నీటిని దిగువకు వదిలి పెడుతున్నారు. మిడ్‌మానేరుకు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వరద నీటితోపాటు ఎస్సారెస్పీ వరదకాలువ ద్వారా నీళ్లు వస్తుండడంతో శ్రీపాదఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలను నిలిపివేశారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు..

జగిత్యాల: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు మూడోసారి తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో ఈనెల 27వతేదీన ఉదయం 10గంటలకు 8 వరద గేట్లు ఎత్తి 25వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వరదనీరు రాక ఇంకా పెరగడంతో గురువారం సాయంత్రం 4గంటల వరకు 39గేట్లు పైకి ఎత్తి 3,55,000 క్యూసెక్కుల నీటిని గోదావరికి వదిలారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి

2,75,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 67.057టీఎంసీల నీరునిల్వ ఉంది. కాగా వరద గేట్లు పైకి ఎత్తడం, కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకుకలిపి ప్రాజెక్టునుంచి 3,55,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 17,300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. నదీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.35టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 9600 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు పోటెత్తిన వరద..

- 17గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల ...

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) ఎగువభాగన కురిసిన భారీవర్షాలకు మానేరువాగు నుంచి ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. బుధవారం సాయంత్రం వరకు 20వేలలోపు మాత్రమే ఉన్న వరద నీరు రాత్రి 10 గంటల వరకు 99 వేల 845 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో మిడ్ మానేరు ప్రాజెక్టు అధికారులు 17గేట్ల ద్వారా 47,327 క్యూసెక్కుల నీటిని దిగువనఉన్న ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు విడుదలను పెంచారు. గురువారం 75,375 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నాయి. మానేరు, ములవాగు ద్వారా 62875, ఎస్సారెస్పీ నుంచి వరద కాలువద్వారా 12,500క్యూసెక్కులనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజీ10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 9600, తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 315.41 మీటర్లు ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 21.334 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. అయితే అప్పర్ మానేరు నుంచి మానేరు వాగు ద్వారా భారీగా వరద నీరు రావడంతో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో నీటి మట్టం భారీగా పెరిగింది.



మిడ్ మానేరు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు

మహిళలు అన్నిరంగాల్లో ముందంజ

- కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు అందిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తూ ముందంజలో నిలుస్తారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని కోర్టు చౌరస్తాలో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల చేతికి తాళం చెవి ఇస్తే ఇల్లు బాగుపడుతుందని మోదీ గారు నమ్మి దేశ బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ చేతిలో పెట్టారన్నారు. ఆర్థిక ప్రగతిలో ప్రపంచంలోనే నాల్గవ స్థానానికి చేర్చారన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పమేలా సత్పతి వినూత్న కార్యక్రమాలతో పాలన చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచితంగా ఎలక్ట్రిక్ ఆటోలిస్తున్నామ న్నారు. పీజీ బీటెక్ చేసిన మహిళలు స్వయం ఉపాధి కోసం ఆటోలు నడిపేందుకు సిద్ధపడటం సంతోషకరమన్నారు. కరీంనగర్‌లో 15 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా ఎలక్ట్రిక్ ఆటోలను అందజేస్తున్నామన్నారు. కలెక్టర్ రెండు నెలలు ప్రత్యేక శిక్షణనిచ్చి డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారన్నారు. ఒక్కో ఆటో ఖరీదు 3.5 లక్షలపైగానే ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- మానేరు జలాలకు కలెక్టర్, ఎమ్మెల్యే పూజలు
- మిడ్ మానేరు రిజర్వాయర్‌లో నీటి మట్టం పై ఆరా



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బోయినపల్లి మండలంలోని మధ్య మానేరు రిజర్వాయర్ వద్ద మానేరు జలాలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్దకు చేరుకొని ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోపై తీశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం ఎంత ఉందో నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులోకి సిరిసిల్ల మానేరువాగు, వేములవాడ మూలవాగు నుంచి, ఎస్సారెస్పీ వరద కాలువ నుంచి వరద ప్రవాహం వస్తుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 27.5 టీఎంసీలు కాగా 21.5 టీఎంసీలు నీరు ఉందని, 75 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుందని, ఔట్‌ఫ్లో 57 వేల క్యూసెక్కులు ఉందని అధికారులు కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. నీటిమట్టాన్ని పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేసిన చేస్తున్న సమయంలో ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండేలా ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని ఆదేశించారు. ఎగువమానేరు ప్రాజెక్టు వద్ద చిక్కుకుపోయిన రైతులను సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ ద్వారా క్షేమంగా గమ్యం చేర్చారని వివరించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బిగితే దగ్గరుండి ముమ్మర చర్యలు చేపట్టారని పేర్కొన్నారు ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈ ఈ కిషోర్, డీఈలు శ్రీనివాస్, అంజయ్య, ఇంచార్జ్ తహసిల్దార్ భూపేష్ ఎంపీడీవో జయశిలా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాయికల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం చింతలూరు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లికి చెందిన సుద్దేవార్ వినోద్ (21) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం దోమలగండి గ్రామానికి చెందిన సుద్దేవార్ రాములు పది సంవత్సరాల క్రితం మోరపెల్లికి వచ్చి స్థిరపడ్డారు. రాములు కొడుకు వినోద్ ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. దీంతో పనిచేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో వినోద్ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చందగళ్ల రాజు(32) గురువారం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26న సాయంత్రం రాజు ఇంట్లో వాళ్లకి పొలం వద్దకు వెళ్లివస్తానని చెప్పి పోయాడు. కానీ రాత్రివరకు ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఇరుగు పొరుగు వారిని వాకబు చేసినా ఫలితం లేకపోయింది. బుధవారం మధ్యాహ్నం కనగర్తి నుంచి మల్యాలకు వచ్చే కాలువలో గ్రామస్తులకు రాజు మృతదేహం కనిపించింది. బాధితుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లను నిరంతరం పర్యవేక్షించాలి

- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు, ఉద్యోగులు నిరంతరం సబ్‌స్టేషన్లను, విద్యుత్ స్తంభాలను పర్యవేక్షించాలని టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. కరీంనగర్ సర్కిల్ ఆఫీసులో గురువారం లోడ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించి వర్షాలవలన విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల పనితీరు, స్తంభాలు, లైన్ల పనితీరు స్థితిగతులను తనిఖీచేశారు. అనంతరం ఎస్‌ఈ మేక రమేష్‌బాబు డీఈలు, ఏడీలు, ఏఈల సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాలలో విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా, తీసుకోవాల్సిన భద్రత, జాగ్రత్తల గురించి వివరించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించినారు. ఏ ఒక్క ఉద్యోగి సెలవుపై వెళ్లరాదని ఆదేశించారు. సమావేశంలో డీఈలు జంపాల రాజం, పి చంద్రమౌళి ఎం తిరుపతి ఎస్సై ఓ రాజేంద్రప్రసాద్ ఏడీలు లావణ్య పి శ్రీనివాస్‌గౌడ్, జి శ్రీనివాస్ లావణ్య. అంజయ్య, జి. రఘు, ఏఈలు పాల్గొన్నారు.

ఆర్మీ హెలికాప్టర్ సహాయంతో ఒడ్డుకు చేరిన కూలీ కుటుంబం



ఒడ్డుకు చేరిన కూలీ కుటుంబం

గంబీరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట మండలం కోళ్లమద్ది వద్ద ఇటుకబట్టీల వద్ద బుధవారం చిక్కుకున్న ముగ్గురిని హెలికాప్టర్ల సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రదీప్, అతడి భార్య చాయ, కొడుకు రాహుల్‌లు కూలీపనిలో భాగంగా బుధవారం మానేరు అవతలివైపు ఇటుకబట్టీల వద్దే ఉండిపోయారు. వరదల్లో చిక్కుకు పోయామని గ్రామస్థులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామమాజీ సర్పంచ్ కేశవరావు కలెక్టర్‌దృష్టికి తీసుకెళ్లారు. ఆర్మీహెలికాప్టర్ల సహాయంతో కోళ్లమద్ది సమీపాన ఇటుక బట్టీ వద్ద ఉన్న కూలీలను ఒడ్డుకు చేర్చారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు..



- నేడు జాతీయ క్రీడా దినోత్సవం
- అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉక్కు లాంటి సంకల్పంతో ముందుకు సాగాల్సిన యువతలో నిస్తేజం ఆవహిస్తోంది. జీవితంలో గెలుపు ఓటములు సహజమని మర్చిపోతున్నారు. గెలుపొస్తే ఆకాశమే హద్దుగా.. ఓడిపోతే పాతాళమే దిక్కుగా వ్యవహరిస్తున్న యువత తీరు ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో క్రీడా స్ఫూర్తితో యువత ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నది. పిల్లల్లో జీవితంపట్ల సానుకూల దృక్పథం పెరగడానికి దోహదపడే క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. క్రీడల్లో గెలుపు ఓటముల మధ్య తేడా తెలియదు. పోరాడి ఓడినా సంతృప్తి మిగులుతుంది. క్రీడల పట్ల ప్రతిఒక్కరూ సానుకూలంగా వ్యవహించాలి. క్రీడాకారులను ప్రోత్సహించాలి.

జాతీయ క్రీడా దినోత్సవ నేపథ్యం

భారత దేశ హాకీ గొప్పదనాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన మహా క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్. హాకీ అనే పదానికి మారు పేరుగా నిలిచిన మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు ఆగస్టు 29న మనం జాతీయ క్రీడా దినంగా నిర్వహించుకుంటున్నాం. హాకీ క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతినార్జించి పెట్టిన ఆయన ప్రపంచ హాకీ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచి పోయారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా కరీంనగర్

రాష్ట్రస్థాయి క్రీడలకు కరీంనగర్ వేదికగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడ లను కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. అలాగే రాష్ట్రస్థాయి సీబీఎస్‌ఈ కబడ్డీ పోటీలను జిల్లా కేంద్రంలోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించారు. చొప్పదండి నవోదయ పాఠశాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల జోనల్‌స్థాయి ఖో-ఖో పోటీలను నిర్వహించారు. వీటితోపాటు కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠ శాలలో సీబీఎస్‌ఈ రీజినల్ టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. జిల్లాకు చెందిన మాస్టర్ అథ్లెట్స్ మధుసూదన్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల కెనడాలో జరిగిన ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం సాధించిన తొలి క్రీడాకారిణిగా ఉమ్మడి జిల్లాకు చెందిన తానపర్తి చికిత నిలిచింది.

అంతరించిపోతున్న క్రీడా మైదానాలు

కరీంనగర్ జిల్లా క్రీడలకు, క్రీడాకారులకు నెలవుగా మారినప్పటికీ జిల్లాలో క్రీడా మైదానాలు రోజు రోజుకు అంతరించి పోతున్నాయి. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం ఒక్కటే పోటీల నిర్వహణకు దిక్కుగా మారింది. గత ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని, జ్యోతి బాపూలే మైదానాన్ని పార్కులుగా మార్చడంతో క్రీడాకారులకు శిక్షణకు మైదానాలు లేకుండా పోయారు. పలు పాఠశాలల్లో సైతం క్రీడా మైదానాలు లేవకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

నిర్బంధ పాఠ్యాంశంగా చేయాలి..

నందెల్లి మహిపాల్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు



క్రీడలపై, క్రీడాకారులపై ప్రభుత్వాల చిన్న చూపు మారాలి. దేశంలోని ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన ఏదో ఒక క్రీడను ఆడే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి. క్రీడలను అన్ని పాఠశాలల్లో నిర్బంధ పాఠ్యాంశంగా చేయాలి. పాఠశాల స్థాయి నుంచే క్రీడా సంస్కృతి నెలకొల్పాలి. జీవితంలో క్రీడలను ఒక భాగంగా చేయాలి. క్రీడల ద్వారానే ఆరోగ్యమని చాటి చెప్పాలి.

క్రీడలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా

గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఒలింపిక్ సంఘ కార్యదర్శి



కరీంనగర్ జిల్లా క్రీడలకు కేంద్రంగా మారింది. జిల్లాలో పలు రాష్ట్రస్థాయి క్రీడలను ఘనంగా నిర్వహించాం. జిల్లాలోని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తాం. జిల్లాలో క్రీడల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. వివిధ క్రీడా సంఘాలు తమ కార్యక్రమాలను నిర్వహించుకునేటట్లు కృషి చేస్తాం.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

వి శ్రీనివాస్, డీఎస్‌డీవో



మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో జిల్లా క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి. చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యం కూడా ముఖ్యమని తల్లిదండ్రులు గ్రహించాలి. క్రీడా శాఖ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని క్రీడలను నిర్వహిస్తున్నాం. జిల్లాలో క్రీడా వసతులు మెరుగుకు కృషి చేస్తున్నాం.



కుంటలో పడి బాలుడి మృతి

జగిత్యాలరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కుంట దినేష్ (8) అనే బాలుడు ప్రమాదవశాత్తు తన ఇంటి సమీపంలో గల నీటి కుంటలో పడి మృతి చెందాడు. జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం బాలుడు తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు కుంటలో పడి ఊపిరాడక అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కాలేజీకని వెళ్లి అస్థిపంజరమై..


రిశ్వంత్‌పటేల్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రం లోని విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలానికి చెందిన విద్యార్థి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట మాజీ ఉపసర్పంచ్ నోముల గణేష్‌కు ఒక్క కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు నోముల రిశ్వంత్‌పటేల్ ఉన్నత చదువుల కోసమని పంజాబ్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో బీటెక్‌లో చేర్పించాడు. ఏడాది క్రితం మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని సెలవుల కోసం ఇంటికి వచ్చాడు. తిరిగి గత సంవత్సరం ఆగస్టు నెలలో కాలేజీకి బయలుదేరివెళ్లాడు. అప్పటి నుంచి రిశ్వంత్‌పటేల్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కాలేజీలో సంప్రదించగా రాలేదని తెలిపారు. దీంతో తండ్రి గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసమయంలో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో ఉన్నట్లు తెలపడంతో తండ్రి, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఏడాది తరువాత ఈనెల 26న కేదార్‌నాథ్‌లో అస్థిపంజరంతో పాటు నోముల రిశ్వంత్‌పటేల్ కాలేజీ ఐడీ కార్డు, బట్టలు అక్కడి పోలీసులకు కనిపించడంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే తండ్రి నోముల గణేష్, బంధువులు వెళ్లి చూడగా రిశ్వంత్ పటేల్‌వని గుర్తించి అక్కడే అంత్యక్రియలు జరిపారు.

జగిత్యాల ఎమ్మెల్యేకు పరామర్శ

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ బుధవారం ప్రమాదవశాత్తు జారి పడడంతో ఎడమ కాలుకు ఫ్యాక్చర్ అయింది. స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. సుమారు 45 రోజులు విశ్రాంతిలో ఉండాలని వైద్యులు సూచించారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత, జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ప్రముఖ న్యాయవాది దామోదర్‌రావు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీ సభ్యులు పరామర్శించారు. ఎస్పీ అశోక్‌కుమార్ సెల్‌ఫోన్‌లో ఎమ్మెల్యే సంజయ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం విస్తారంగా వర్షాలు కురిశాయి. జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం బ్రిడ్జి రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగింది. జగిత్యాల నుండి ధర్మపురి రాకపోకలను నిలిపివేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ అరుణ్‌కుమార్ తెలిపారు. బ్రిడ్జి ఉధృతిని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్, రూరల్ ఎంపీఓ రవిబాబు పరిశీలించారు.

●**కోరుట్ల:** పట్టణంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పట్టణంలోని తాళ్ళ చెరువు నిండు మత్తడిపై నీరు ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంగా చేశారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, అయిలాపూర్ రోడ్డులో వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కోరుట్ల రూరల్: చిన్నమెట్‌పల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు నిండి వర్షం నీరు ఉధృతంగా ప్రవహించాయి. కల్లూర్ గ్రామ శివారులోని వాగు తీవ్ర ఉద్రిత్తంగా ప్రవహించి వంతెనకు ఇరువైపుల గుర్రెపు డెక్కను నిండి వంతనపై నుండి కొంత మేర నీరు ప్రవహించడంతో ద్విచక్ర వాహన రాకపోకలను గ్రామస్థులు నిలిపివేశారు. మండలంలోని పలు గ్రామాలను ఆర్‌డీఓ జీవాకర్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీఓ రామకృష్ణ పరిశీలించారు.

నీట మునిగిన ఆకుసాయిపల్లె వంతెన

ధర్మపురి: ధర్మపురి మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఆకుసాయిపల్లె లోలెవల్ వంతెన నీట మునిగిపోయింది. దీంతో ఉదయం నుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ధర్మపురి-జగిత్యాల మధ్య ప్రజా సంబంధాలు తెగిపోయాయి. పెద్దనక్కలపేట-చిన్ననక్కలపేట మధ్య గల వాగు వంతెన కింది నుంచి నీరు ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నల్లకుంట మత్తడి పైనుంచి నీరు ప్రవహిస్తుంది. ధర్మపురి పట్టణంలోని తోట్లవాడలో వినాయక మండపం వద్ద షెడ్డు కూలిపోయింది. అక్కపెల్లి చెరువు వరద, నీట మునిగిపోయిన ఆకుసాయిపల్లె లో లెవల్ వంతెనను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జగిత్యాల ఆర్‌డీవో మదుసూదన్ పరిశీలించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, రవికుమార్ ఆకుసాయిపల్లె గుట్ట వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపి వేయించారు. మండలంలోని బోయగూడెం-ముగ్గిడి వద్ద కల్వర్టు పైనుండి నీరు ప్రవహించడం వల్ల ఆరెపల్లి వరకు నడిచే బస్సును రద్దు చేశారు. జైనా, రాజారం, పెద్దనక్కలపేట, రాయపట్నం, ఆకుసాయిపల్లె గ్రామాల్లో పంట చేనుల్లో నీరు చేరింది. ఆకుసాయిపల్లె అంజనేయస్వామి ఆలయం చుట్టు నీరు చేరింది. అక్కపెల్లి చెరువు నిండి జల కళ సంతరించుకుంది.

●ధర్మపురి మండలంలో గురువారం గోదావరి నది ఉగ్ర రూపం దాల్చింది. సంతోషీమాత, గోదావరి మాత ఆలయాల్లోకి వరద నీరు చేరింది. శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ రామలయం వరకు కూడా నీరు చేరడం వల్ల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. గోదావరి నదీ ఒడ్డున గల చిరు వ్యాపారులను అధికారులు ఖాళీ చేయించారు. ధర్మపురి వద్ద సంతోషీమాత, మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మి, రాయపట్నం వద్ద స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి.

●**మెట్‌పల్లి రూరల్:** ఏఎస్సార్‌తండా గ్రామ ప్రధాన రహదారిపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వేంపేటలో మాదన్నకుంట, కొండ్రికర్లలో వాగు ఉధృతంగా ప్రవహించింది.

ఉప్పొంగిన వాగులు

రాయికల్: మండలంలోని పలు వాగులు, వంకలు ఉప్పొంగాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాయికల్ పట్టణంలోని 7వ వార్డులో పంట కాలువ నుంచి వరద నీటి ప్రవాహంతో పొలానికి గండి పడింది. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని భూపతిపూర్, రామాజీపేట గ్రామాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. మండలంలోని మూటపెల్లి రోడ్డు పైనుంచి వాగు ప్రవహిస్తుంది. రాయికల్ పట్టణంలోని శివాలయంలోకి వరద నీరు వచ్చి చేరింది. మండలంలోని ఇటిక్యాల, భూపతిపూర్ రోడ్లపై వాగులు ప్రవహించడంతో రోడ్డుకిరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బోర్నపెల్లి గోదావరి నది వద్ద స్నానాల ఘట్టాల వరకు నీరు వచ్చి చేరుకుంది. రాయికల్-వీరాపూర్ రోడ్డు పరిస్థితిని తహసీల్దార్ నాగార్జున సమీక్షించారు. తాట్లవాయి గ్రామంలోని గోదాం చుట్టూ వరద నీరు వచ్చి చేరింది. మూటపెల్లి-కొత్తపేట గ్రామాల మధ్య వాగు పొంగి ప్రవహించడంతో రోడ్డు తెగిపోయి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రామాజీపేట-భూపతిపూర్ గ్రామాల మధ్యలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.


కమ్మునూర్ బ్రిడ్జి వద్ద వరద నీరు

●ఎక్స్‌కావేటర్ సహాయంతో గర్భిణిని ఒడ్డుకు చేర్చిన యువకులు

రాయికల్ మండలం వడ్డెలింగాపూర్‌లో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని కొందరు యువకులు గురువారం ఎక్స్‌కావేటర్ సహాయంతో రహదారిపై ప్రవహిస్తున్న వాగు నీటి నుంచి ఒడ్డుకు చేర్చారు. రాయికల్ మండలం వడ్డెలింగాపూర్‌లో కళ్యాణి అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి ప్రయత్నించారు. భూపతిపూర్-రామోజీపేట గ్రామాల మధ్య వాగు నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో కొందరు యువకులు ముందుకు వచ్చి ఎక్స్‌కావేటర్ సహాయంతో గర్భిణిని వాగు నీటి నుంచి ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

●ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో కమ్మునూర్ సమీపంలోని పంట పొలాలు గోదావరి నది వరదలో మునిగి పోయాయి. చెర్లపెల్లి గ్రామంలోని రగ్బాలో ఉన్న కుటుంబాలకు పూర్తిగా రాకపోకలు నిలిచి పోయాయి. రోళ్ళవాగు నుండి ఎస్సారెస్పీ కాలువ ద్వార వస్తున్న నీరు నర్సింహులపల్లి గ్రామంలోని ఇళ్ళలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోదావరి పరివాహక గ్రామాలైన రంగసాగర్, మంగేళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

●**సారంగాపూర్:** మండలంలో ఎడతెరిపి లేకుండా జోరు వాన కురిసింది. లచ్చక్కపేట నుండి జగిత్యాల వెళ్ళే మార్గంలో లచ్చక్కపేట వంతెన ఉధృతంగా ప్రవహించింది. లచ్చక్కపేట నుండి పోచంపేట వెళ్ళే మార్గంతో రోడ్లు తెగి పోయాయి. రేచపల్లి ఎస్సీ కాలనీలో ఇళ్ళలోకి వరద నీరు రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలో గల బతుకమ్మ కుంట మత్తడి తెగిపోవడం జరిగింది. భీంరెడ్డిగూడెం వెళ్ళే మార్గంలో వరద నీరు ప్రవాహం ఎక్కు. ఉండటంతో రాకపోకలను నిలిపి వేశారు. మండల కేంద్రానికి చెందిన గొల్లపెల్లి హన్మండ్లు ఇంటిలోకి వరద నీరు రావడంతో పూర్తిగా ఇంట్లోని వస్తువులు తడిపోయాయి. తహశీల్దార్ వహిదుద్దీన్, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై పీ. గీత, ఆర్‌ఐ వెంకటేష్, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు కేతర స్థాయిలో పర్యటిస్తూ చర్యలు చేపట్టారు.


భూషణరావుపేట శివారులో తెగిన రాళ్లవాగు కుడి కాలువ

తెగిన రాళ్ళవాగు కుడి కాలువ

కథలాపూర్: రాళ్ళవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ మళ్ళీ తెగింది. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం దాకా కురిసిన భారీ వర్షం కారణంగా పైభాగం నుంచి వరద వల్ల ఇటీవల మరమ్మతులు చేసిన ప్రాంతంలో మరోసారి తెగడంతో చివరి ఆయకట్టు రైతులకు నిరాశే మిగిలింది. మరోసారి గండి పడడంతో భూషణరావుపేట, కథలాపూర్, ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాలకు చెందిన ఆయకట్టుదారులకు తీవ్ర నిరాశే ఎదురైంది. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కురిసిన భారీ వర్షం అతలాకుతలం చేసింది. అంబారిపేట- తుర్తి గ్రామాల మధ్య వంతెన లేకపోవడంతో పైభాగం నుంచి వచ్చిన వరద నీటి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేములవాడ-కోరుట్ల రహదారిపై వరద నీటి కారణంగా కొద్ది సేపు వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ఇప్పపల్లి శివారులో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది.

రాకపోకలకు అంతరాయం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట, ఓబులాపూర్, ధాంరాజుపల్లి, వాల్గొండ, వివిరావుపేట గ్రామాల శివారులో గల గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మొగిలిపేట, వాల్గొండలలోని పుష్కరఘాట్ వరకు వరద నీరు చేరింది. మెట్లు నీట మునిగి ప్రమాద స్థాయిలో గోదావరి నది పారుతుంది. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గోదావరి పరివాహక గ్రామాలను సందర్శించి, నీటి ఉధృతిని పరిశీలించారు. గొర్రెపల్లి గ్రామ శివారులో గల ఒర్రె నీరు ప్రధాన రహదారిపై నుండి ప్రవహిస్తుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. రహదారి కల్వర్ట్ నీటి ఉధృతికి దెబ్బతిన్నది. వర్షాలకు మల్లాపూర్ నుండి జగిత్యాల వైపు గురువారం రాకపోకలు నిలిచి పోయాయి.

●**కొడిమ్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపైకి చేరి ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

కూలిన జగ్గనిఒర్రె రక్షణగోడ

మల్యాల: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంకు మల్యాల మడల కేంద్రంలోని జగ్గనిఒర్రె రక్షణగోడ కూలి ప్రమాదకరంగా మారింది. నూకపల్లి, రామన్నపేట వరదకాలువ వంతెనపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నూకపల్లి శివారులో వరదకాలువ కోతలకు గురి కావడంతో పంటచేల వద్దకు నీరు చేరుకుంది. ఓగులాపూర్, నూకపల్లి, మల్యాలలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీవో రఘువరణ్ పరిశీలించారు.

●**పెగడపల్లి:** మండలంలో గురువారం చెరువులు, వాగులు, లోతట్టు ప్రాంతాలను మండల అధికార బృందం పరిశీలించారు. తహసీల్దార్ బి.రవీందర్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ కిరణ్ కుమార్‌లు సంయుక్తంగా వెల్లి మద్దులపల్లి మట్టి వాగును, లింగాపూర్ పెద్ద చెరువును, శాలపల్లి అడుప పల్లి గ్రామాల మధ్య బ్రిడ్జిని పరిశీలించారు.

కుంగిన స్తంభంపల్లి చెరువు కట్ట

వెల్గటూర్: భారీ వర్షాల కారణంగా స్తంభంపల్లి చెరువులోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీనితో చెరువు కట్ట తూము వద్ద కుంగుబాటుకు గురైంది. గమనించిన స్థానికులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమర్‌కు, అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన మంత్రి అడ్లూరి అధికారులను అప్రమత్తం చేశారు. స్థానికుల సహాయంతో కట్ట కుంగిన చోట ఇసుక బస్తాలను వేసి తాత్కాలికంగా నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత చెరువు కట్టను పరిశీలించాచారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసుదన్, తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్ పాల్గొన్నారు.

●కోటిలింగాల వద్ద గోదావరి వరద ఉధృతిని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, రాజయ్య పాల్గొన్నారు.

●కుమ్మరిపల్లి మాడల్ స్కూల్ ముందు నుండి గ్రామంలోకి వెళ్లే రోడ్డు పైనుండి కాలువను తలపించేలా వరద ప్రవహించింది. మండలంలో కురిసిన వర్షం కారణంగా స్తంభంపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి కొండపె నుండి నీరు జలపాతంలా కిందికి జాలువారింది.

●పిడుగుపడి రైతుకు గాయాలు

మేడిపల్లి: మేడిపల్లి మండలం కట్లకుంటలో బుధవారం పిడుగుపాటుకు తిపిరెడ్డి నారాయణరెడ్డి (45)అనే రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం వర్షం రావడంతో తన పామాయిల్ తోటలో నారాయణరెడ్డి చెట్టు కింద కూర్చోగా పెద్ద ఉరుముతో పిడుగు పడిందని స్థానిక రైతులు తెలిపారు.

●**ఇబ్రహీంపట్నం:** గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. మండలంలోని ఎర్దండి గోదావరి నదిని సందర్శించారు. యామపూర్ ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య కొట్టుకొని పోయిన తాత్కాలిక రోడ్డును పరిశీలించారు. జిలా పంచాయతీ అధికారి మదన్ మోహన్ ఎర్దండీ, కోమటి కొండాపూర్ గ్రామాల గోదావరినది తీరా ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

గొల్లపల్లిలో పిడుగుపాటు

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలో వర్షంతో చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల కేంద్రానికి చెందిన సిరికొండ శ్రీనివాస్ ఇంటి బాత్రూమ్‌పై పిడుగుపడింది. వినాయ చవితి కావడంతో ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.


ఫకీర్ కొండాపూర్, యామాపూర్ గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రహదారి

చేనేత హస్త కళలను ప్రోత్సహించాలి


చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చేనేత హస్తకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని జగిత్యాల పట్టణంలోని చేనేత హస్త కళ వస్తువుల కేంద్రం నిర్వాహకులు కిషోర్ తెలిపారు. జగిత్యాల పట్టనంలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో శ్రీ ఉషోదయ చేనేత హస్తకళా మేళాను ప్రారంబించడం ఆనందదాయకమన్నారు.

దేశ సంస్కృతిలో అంతర్భామయిన చేనేతలు, హస్తకళలు జీవన సౌందర్యానికి ప్రతీకలన్నారు. కళానైపుణ్యాన్ని, హస్తకళాకారులు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతారన్నారు. ప్రతి ఒక్కరు చేనేత హస్తకళా వేదికను సందర్శించాలని కోరారు.

కొలువుదీరిన గణనాథులు

జగిత్యాల అర్బన్, 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టవర్ సర్కిల్‌లో, 8వ వార్డులోని వినాయకుని ఆలయంలో, పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మట్టి గణపతులను పంపిణీ చేశారు. వెలమ సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షులు అయిల్నేని సాగర్‌రావు, కొక్కుల ఎల్‌జీ రమేష్ పాల్గొన్నారు. జగిత్యాల పట్టణంలో వాడవాడలో వివిధ రూపాల్లో గణనాథులను భక్తులు ఏర్పాటు చేశారు.


కోరుట్ల/కోరుట్లరూరల్: పట్టణం, కోరుట్ల మండలంలోని వివిధ దేవాలయాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహాకులు ఘనంగా ప్రారంభించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గురువారం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. పట్టణంలోని పోచమ్మ వాడలోని గ్రీన్ హోప్ యూత్ సభ్యులు సుగంధ ద్రవ్యాలతో పోలిన గణపతిని, పట్టణంలోని బాలాజీ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు తామరాకులతో కూడిన ఇస్తారులతో వినాయకుడి తయారు చేసి పూజలను చేస్తున్నారు.

మెట్‌పల్లిటౌన్: పర్యావరణ హితం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది, లయన్స్ క్లబ్ మెట్‌పల్లి, పలువురు వ్యాపారస్తులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనర్ టి మోహన్, మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్, విద్యుత్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.


పూజలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్షేత్రంలోని వివిధ వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు జరిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది, బ్లూకోల్ట్ బృందం సభ్యులు తగు సూచనలు అందిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

మెట్‌పల్లి రూరల్/గొల్లపల్లి/ఇబ్రహీంపట్నం/రాయికల్/బీర్‌పూర్/కథలాపూర్/మల్లాపూర్/మల్యాల/కొడిమ్యాల/వెల్గటూర్/మేడిపల్లి: వినాయక చవితి వేడుకలు మెట్‌పల్లి, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం, రాయికల్, బీర్‌పూర్, కథలాపూర్, మల్లాపూర్, మల్యాల, కొడిమ్యాల, వెల్గటూర్, మేడిపల్లి మండలాల్లో వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని కుల, యువజన సంఘాల నాయకులు భక్తిశ్రద్ధలతో మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని గుడేడి రెడ్డి సంఘం మట్టి వినాయకుడని ప్రతిష్ఠించారు. నిత్యాన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులనే వాడుతామని రెడ్డి సంఘ సభ్యులు పేర్కొన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలోనూ గణేశ్ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గణపతి మండపాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు మండపాలను పరిశీలిస్తూ నిర్వాహకులకు తగు సుచనలు చేస్తున్నారు.


జగిత్యాల మార్కెట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణనాథుడు

సింగిల్‌విండో కార్యదర్శుల బదిలీ

జగిత్యాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న 51 మంది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులను గురువారం బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత కార్యదర్శులు బదిలీ అయిన ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కుంటలో పడి బాలుడి మృతి

జగిత్యాలరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కుంట దినేష్ (8) బాలుడు ప్రమాదవశాత్తు తన ఇంటి సమీపంలో గల నీటి కుంట లో పడి మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బాలుడు తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో ఇంటి వద్ద ఉన్న కుంటను గమనించకపోగా ప్రమాదవశాత్తు కుంటలో పడి ఊపిరాడక అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసుఉ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

'యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం'

గొల్లపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతకు కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానిదేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధర నరేష్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగానికి సరిపడా యూరియాను సరఫరా చేయడంలో బీజేపీ సర్కార్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని విమర్శించారు.

అంజన్న సన్నిధిలో న్యాయమూర్తుల పూజలు

మల్యాల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు జిల్లా న్యాయమూర్తి కుశ, జగిత్యాల రెండవ అదనపు న్యాయమూర్తి నిక్షయ గురువారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ అధికారులతో పాటు పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

కోరుట్ల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 15 గ్రామ పంచాయితీల ఓటర్ల లిస్టున్ గురువారం ఎంపీడీవో రామకృష్ణ ఆద్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ప్రదర్శించారు. అభ్యంతరాలుంటే ఈ నెల 30 తేదీ వరకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి ఓటరు జాబితాను ప్రదర్శించారు.

●రాయికల్: ఓటర్ల ముసాయిదా జాబితాను ఎంపీడీవో చిరంజీవి మండల ప్రజా పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులపై ఉంచారు.

●వెల్గటూర్: గ్రామ పంచాయితీ వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను గురువారం మండల పరిషత్ కార్యాయలయంలో ఎంపీడీవో కృపాకర్ ప్రదర్శించారు.

●కొడిమ్యాల: మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా ముసాయిదా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ఎంపీడీవో స్వరూప నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులలో నిర్వహించే స్కానింగ్ సెంటర్‌లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా మెడికల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొతగా దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్‌లతో పాటు ఇప్పటికే ఉన్న స్కానింగ్ సెంటర్‌లకు అనుమతి గురించి అడ్వయిజరీ కమిటీ ముందు ఉంచామన్నారు. ఆరోగ్య శాఖ ఆదేశాలనుసారం స్పెష్ఛ్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులను హెచ్చరిస్తు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మాతా శిశు సంరక్షణాధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినెల ఫాం ఎఫ్ మరియు ఆన్లైన్ పోర్టల్‌లో పరచడం 5 వ తేదీలోగా వారికి కేటాయించిన పట్టణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కార్యాలయంలో సమర్పించవలెనని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు ఎన్ శ్రీనివాస్, డాక్టర్ విశ్వభారతి, సాయి సుధా, పూర్ణచందర్, తవుటు రామచంద్రం, ఆరోగ్య విస్తరణ అధికారులు ఎనుగంటి రాజేశం, తరాల శంకర్, కటుకం భూమేశ్వర్ తదితతరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్